# విద్యార్థులను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి



లింగారెడ్డిపేట్‌లో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో..

- బడిబాటలో భాగంగా గ్రామాల్లో పర్యటించిన ఉపాధ్యాయులు
- ప్రభుత్వ పాఠశాల్లో పలువురు విద్యార్థులకు అడ్మిషన్లు

బాన్సువాడ రూరల్/ నస్రుల్లాబాద్/ ఎల్లారెడ్డి రూరల్/ రామారెడ్డి, జూన్ 7: ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నదని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బాన్సువాడ మండలంలోని చిన్నరాంపూర్ గ్రామంలో ఉపాధ్యాయులు శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ బడిఈడు పిల్లలతోపాటు బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్చుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నక్క ప్రవీణ్, రవిశంకర్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్ మండలకేంద్రంతోపాటు మైలారం, బొమ్మన్‌దేవ్‌పల్లి, దుర్కి, అంకోల్ తదితర గ్రామాల్లో ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, బడిఈడు పిల్లలను బడిలో చేర్పించుట, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు హన్మాండ్లు, ఉపాధ్యాయులు ఇందిర, రుక్మిణి, అంగన్‌వాడీ టీచర్ గంగామణి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాల్లో కల్పిస్తున్న సౌకర్యాలను నిర్వహించారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం వేలాది రూపాయలను వెచ్చించి, ప్రభుత్వ పాఠశాలల్లో మంచి సౌకర్యాలను కల్పిస్తున్నదని, విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వనాథం, ఉమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, జన్నూబాయి తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి మండలంలోని మోషంపూర్, పోసానిపేట్ తదితర గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.



చిన్నరాంపూర్‌లో బడిఈడు పిల్లల వివరాలను నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగభూషణం, సంగమేశ్వర్, విజయ, నరేందర్, సీఆర్పీ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

## ఫెర్టిలైజర్ దుకాణాల తనిఖీ



మెనూర్‌లో విత్తనాల దుకాణంలో బిల్లులు పరిశీలిస్తున్న అధికారులు

మద్నూర్, జూన్ 7 : మండలకేంద్రంతో పాటు మెనూర్ గ్రామంలో విత్తన, ఎరువుల దుకాణాల్లో వ్యవసాయాధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. టాస్క్‌ఫోర్స్ టీం బాన్సువాడ ఏడీఏ వీరస్వామి, వ్యవసాయాధికారులు రాజు, సుధాకర్ తనిఖీల్లో పాల్గొన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలకు సంబంధించిన రసీదులను రైతులకు ఇవ్వాలని, ఇన్వాయిస్, స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డు, లైసెన్సును అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. విత్తనాలు, ఎరువును ఎమ్మార్పీకే విక్రయించాలని ఆదేశించారు. లైసెన్స్ ఉన్న వారి దగ్గరే విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి..

భిక్కనూర్, జూన్ 7: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలని ఏడీఏ అపర్ణ ఫర్టిలైజర్ దుకాణాల యజమానులను ఆదేశించారు. మండల కేంద్రంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా రసీదు ఇవ్వాలన్నారు. ఆమెవెంట ఏవో రాధ ఉన్నారు.

## ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం



ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్‌ను సన్మానస్తున్న సంఘం ప్రతినిధులు

ఎల్లారెడ్డి, జూన్ 7 : ఎల్లారెడ్డికి చెందిన ప్రముఖ వ్యాపారి కంచర్ల బాలకిషన్ ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. స్థానిక ఆర్యవైశ్య సంఘ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పట్టణానికి చెందిన పలువురు వ్యాపారులు, వైశ్య కులస్తులు బాలకిషన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ముత్యపు సుదర్శన్, కాపర్తి బాలకిషన్, ఆరుగొండ వెంకట రాజయ్య, డాక్టర్ మారుతీరావు, నునుగొండ శ్రీనివాస్, సిద్ధి చంద్రకాంత్, వెంకటేశం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## హీరో హరీశ్‌బాబును ఆశీర్వదించండి

కామారెడ్డి, జూన్ 7: సినీ రంగానికి కామారెడ్డి జిల్లా నుంచి హీరోగా పరిచయం అవుతున్న బొంపల్లి హరీశ్‌బాబును ఆశీర్వదించాలని అతడి కుటుంబ సభ్యులు కోరారు. ఓసీ సినిమా శుక్రవారం విడుదల అయ్యింది. ఇందులో హీరోగా హరీశ్‌బాబు, డైరెక్టర్‌గా విష్ణుబాబు సినీ రంగ ప్రవేశం చేశారు. కామారెడ్డిలోని ప్రధాన కూడళ్ల వద్ద హీరోకు సంబంధించిన పోస్టర్లు వెలిశాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేయడంతోపాటు వారిని ప్రజలు ఆశీర్వదించాలని కోరుతున్నారు.

## 11న మండల సర్వసభ్య సమావేశం

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 7 : ఈనెల 11వ తేదీన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరుకావాలని కోరారు.

## 19న రాజంపేట మండల..

రాజంపేట, జూన్ 7: మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ లింగాల స్వరూప అధ్యక్షతన ఈనెల 19వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో నిర్వహించే ఈ సమావేశానికి అధికారులు తమ పూర్తి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

## ఫాంపాండ్ నిర్మాణాలను వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధి హామీ ఏపీవో సాయిలు

నాగిరెడ్డిపేట, జూన్ 7: మండలంలోని రైతులు బోరుబావుల వద్ద ఫాంపాండ్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఉపాధి హామీ పథకం ఏపీవో సాయిలు అన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోరుబావులు, రైతుల బోరుబావుల వద్ద ఇచ్చిన నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలన్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో కూలీలతో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులు, పొలాలకు మట్టి తరలింపు, పూడికతీత పనులు నాణ్యతతో చేయించాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలపై సిబ్బందితో చర్చించారు. సమావేశంలో వివిధ గ్రామాల ఉపాధి హామీ సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పోచారాన్ని కలిసిన బల్దియా ఇన్‌చార్జి కమిషనర్



పోచారం శ్రీనివాసరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ శ్రీహరిరాజు

బాన్సువాడ, జూన్ 7: బాన్సువాడ మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమితులైన బి.శ్రీహరిరాజు శుక్రవారం మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే ఆయనకు సూచించారు. కార్యక్రమంలో బల్దియా చైర్మన్, వైస్ చైర్మన్లు జంగం గంగాధర్, షేక్ జుబేర్, కౌన్సిలర్లు, నాయకులు నర్సుగొండ, దొన్కంటి వెంకటేశ్, మహ్మద్ ఎజాస్, నార్ల ఉదయ్‌గుప్తా, సంగ్రాం నాయక్ తదితరులు ఉన్నారు.

***ఫిల్టర్ బెడ్ పరిశీలన..***

పట్టణ ప్రజలకు తాగునీరు అందించే ఫిల్టర్ బెడ్‌ను బల్దియా ఇన్‌చార్జి కమిషనర్ శ్రీహరిరాజు శుక్రవారం పరిశీలించారు. ఇసుకను ఎప్పటికప్పుడు మారుస్తూ.. పట్టణ ప్రజలకు శుద్ధమైన నీటిని అందించాలని సిబ్బందికి సూచించారు. వానకాలం నేపథ్యంలో తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## అటల్ టింకరింగ్ ల్యాబ్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం



శిబిరానికి హాజరైన విద్యార్థులు, గైడ్ టీచర్లు

భిక్కనూరు, జూన్ 7: మండల కేంద్రలోని బాలుర ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ సమ్మర్ బూట్ క్యాంపును జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో మండలంలోని ఆరు పాఠశాలలకు చెందిన 36మంది విద్యార్థులు వారి గైడ్ టీచర్లు హాజరయ్యారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే ఎలక్ట్రానిక్స్‌పై ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందజేయడం ద్వారా శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రేరణ కల్పించడం క్యాంప్ ముఖ్య ఉద్దేశమని అన్నారు. పేపర్ ఎలక్ట్రానిక్స్ ప్రాజెక్ట్స్, ఆర్డీనో ప్రాజెక్ట్ కోడింగ్, త్రీడీ ప్రింటింగ్ తదితర అంశాలపై ట్రైనర్లు మూడు రోజులపాటు శిక్షణ ఇస్తారని జిల్లా సైన్స్ అధికారి తెలిపారు.

# వానకాలం సాగుకు సిద్ధమవుతున్న రైతులు



మండల కేంద్రంలోని ఫెర్టిలైజర్ దుకాణం వద్ద రైతుల సందడి

గాంధారి, జూన్ 7: మండల కేంద్రంలోని విత్తన, ఎరువుల దుకాణాలు రైతులతో కిటకిటలాడుతున్నాయి. మృగశిర కార్తెతో పాటు వాతావరణం చల్లబడడంతో, వర్షకాలంలో పంటలు సాగు చేయడానికి రైతులు విత్తనాలను కొనుగోళ్లు చేస్తున్నారు. మండలంలో నల్లరేగడి, చెలుక, తరుక భూములు ఎక్కువగా ఉండడంతో రైతులు వర్షాధారిత పంటలనే ఎక్కువగా సాగు చేస్తారు. చాలా మంది రైతులు వర్షాలు కురియగానే మక్కజొన్న, పత్తి, కందులు, సోయా పంటలతో పాటు వరి నారుమడులను సిద్ధం చేయడానికి విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. పంటల సాగుకు అవసరమైన విత్తనాలను కొనుగోలు చేయడానికి చుట్టుపక్కల గ్రామాల రైతులు వస్తుండడంతో మండల కేంద్రంలోని ఫెర్టిలైజర్ దుకాణాలు సందడిగా మారాయి. వర్షం సమృద్ధిగా కురిసే వరకు రైతులు విత్తనాలను విత్తుకోవద్దని మండల వ్యసాయాధికారి నరేశ్ సూచించారు.



*గాంధారి మండలంలోని సీతాయిపల్లి చెరువులో శుక్రవారం భారీ చేప లభ్యమైనట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం మృగశిర కార్తె ప్రారంభం సందర్భంగా గ్రామంలోని చెరువులో గంగపుత్రులతోపాటు ముదిరాజ్ కులస్తులు చేపలు పట్టారు. ఈ సందర్భంగా చేపల వలకు సుమారు 10 కిలోల బరువు గల చేప చిక్కింది. ఎన్నడూ లేని విధంగా సీతాయిపల్లి చెరువులో భారీ చేప దొరకడంతో చేపతో సెల్ఫీలు దిగుతూ సంతోషం వ్యక్తం చేశారు.*

*– గాంధారి, జూన్ 7*

## విద్యుదాఘాతంతో గేదె మృతి

పెద్దకొడప్‌గల్, జూన్ 7: పిట్లంలో విద్యుత్ షాక్‌తో ఓ గేదె మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం గ్రామానికి చెందిన గొల్ల రాజేందర్ తన గేదెలను మేపడానికి ఊరచెరువు కట్ట కిందకు తీసుకెళ్లాడు. పొలంలో ఉన్న విద్యుత్ తీగ గేదె కొమ్ములకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతిచెందిన గేదె విలువ రూ.లక్ష వరకు ఉటుందని, ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

## ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

మాచారెడ్డి, జూన్ 7: పాల్వంచ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి ట్రాక్టర్‌ను పట్టుకున్నామని అన్నారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# నేడు జాతీయ లోక్ అదాలత్

కామారెడ్డి, జూన్ 7: జిల్లావ్యాప్తంగా శనివారం లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఏడు బెంచీలతో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కక్షిదారులు రాజీ పడదగిన కేసుల విషయంలో లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరా రు. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి కోర్టుల్లో లోక్ అదాలత్ ఉంటుందన్నారు.

***సద్వినియోగం చేసుకోవాలి..***

బాన్సువాడ/ ఎల్లారెడ్డి, జూన్ 7: బాన్సువాడ మున్సిఫ్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి కుమారి భార్గవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని కోర్టులో నేడు లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. న్యాయస్థానం పరిధిలోని కక్షిదారులు తమ కేసుల పరిష్కారం కోసం లోక్‌అదాలత్‌లో సంప్రదించాలని కోరారు.

## అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



శివప్రసాద్(ఫైల్)

రామారెడ్డి, జూన్ 7: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఇసన్నపల్లిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సిద్ధం శివప్రసాద్(25) తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతడిని దవాఖానలో చూపించడానికి చేసిన అప్పులు అధికమయ్యాయి. అవి తీర్చే మార్గం లేక మనస్తాపం చెంది సోమవారం క్రిమి సంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య భాగ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై సుభాషిణి తెలిపారు.

## కుక్కను తప్పించబోయి.. రాయిని ఢీకొన్న కారు

నాగిరెడ్డిపేట, జూన్ 7 : కుక్కను తప్పించబోయి కారు రాయిని ఢీకొన్న ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణంరాజు అనే ఆర్ఎంపీ ఎల్లారెడ్డి నుంచి గోపాల్‌పేటకు వచ్చి విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం కూడా గోపాల్‌పేటకు వస్తుండగా.. కన్నారెడ్డి గేట్ వద్ద కుక్క ఎదురుగా వచ్చింది. దానిని తప్పించే క్రమంలో కారు రాయిని ఢీకొన్నది. ఈ ప్రమాదంలో కృష్ణంరాజుకు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

## డ్రైనేజీలు శుభ్రంగా ఉంచాలి

బిక్కనూర్, జూన్ 7: వానకాలం ప్రారంభమైన నేపథ్యంలో డ్రైనేజీల్లోని చెత్తను తొలగిస్తూ శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీరు కలుషితం కాకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శి మహేశ్‌గౌడ్‌ను ఆదేశించారు.

## ఎస్సైపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

రాజంపేట్, జూన్ 7: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నాడని రాజంపేట ఎస్సైపై బీజేపీ నాయకులు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సై విధులను సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## గోవులను రక్షించాలని వినతి



ఎస్పీ సింధుశర్మకు వినతిపత్రాన్ని అందజేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

కామారెడ్డి, జూన్ 7: గోవుల అక్రమ తరలింపు ఆపాలని, గోవధను నిషేధించాలని కోరుతూ విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఎస్పీ సింధుశర్మతో పాటు కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కొందరు గోవులను అక్రమంగా తరలించి వధిస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో గో సంరక్షణ సమితి నాయకులు కనికంటి రాజు, విశ్వ హిందూ పరిషత్ నాయకులు బొల్లి రాజు, వడ్ల వెంకటస్వామి, వంగ ప్రసాద్, అశోక్, విశ్వనాథం, బీజేపీ నాయకుడు ఆకుల భరత్, బజరంగ్ దళ్ నాయకుడు రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**WANTED TEACHERS**

★ **Wanted Teachers** to teach English, Maths, Physics, Biology and Social Note: Wanted Lady Accountant Little Hearts High School, Namdevwada, Nizamabad. Cont: 9948712344, 9666020695

**NTZ-324927**

**PASSPORT LOST**

★ I, MUTYALA SAI KRISHNA S/o.Ravindar H.No.6-39, Vill: Srinagar, Gundaram Post, Nizamabad Rural mandal, Dist. Nizamabad. T.S. I lost my original Passport No.**P7516846**. while travelling on motorcycle from Srinagar Village to Nizamabad on dated:20.05.2024 If any one found please **Cont: 9666820162**

**NTZ-324957**

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/- ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

GST వర్తించును

సెల్ : 91827 77590

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


## ద్విచక్ర వాహనం చోరీ

బాన్సువాడ, జూన్ 7: ఫంక్షన్ హాల్ ఎదుట నిలిపిన బైక్‌ను దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన బాన్సువాడలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సంగమేశ్వర్ కాలనీకి చెందిన సయ్యద్ ఖాజా గత నెల 26న రాత్రి పట్టణంలోని యాపై ఫంక్షన్ హాల్ ఎదుట తన ఏపీ25 ఎల్7095నంబర్ ఉన్న టీవీఎస్ స్టార్ బైక్‌ను నిలిపాడు. ఫంక్షన్ ముగించుకొని వచ్చి చూస్తే బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ క్రిష్ణ శుక్రవారం తెలిపారు.

## మీసాన్‌పల్లిలో బోనాల పండుగ



బోనాలను తీసుకెళ్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డి, జూన్ 7: మండలంలోని మీసాన్‌పల్లిలో అమ్మ వారికి శుక్రవారం బోనాలను సమర్పించారు. ప్రతి ఇంటి నుంచి బోనాలను తీసి ఆలయం వరకు ఊరేగించారు. అమ్మవారికి నైవేద్యంతోపాటు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ బోండ్ల సాయిలు, ఏగుల నర్సింహులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యూనిఫామ్‌లను త్వరగా అందించాలి

బిచ్కుంద, జూన్ 7: యూనిఫామ్‌లను త్వరగా అందించాలని ఎంపీడీవో గోపాలకృష్ణ మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. మండల కేంద్రంలో మహిళలు కుడుతున్న దుస్తులను ఆయన శుక్రవారం పరిశీలించారు. విద్యార్థుల నుంచి తీసుకున్న కొలతల ప్రకారం దుస్తులను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయనతోపాటు ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

## నాగిరెడ్డిపేట ఎంపీపీకి సన్మానం



ఎంపీపీ వినీతను సన్మానిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ శోభ

***టేకులపల్లి వినీత నాగిరెడ్డిపేట ఎంపీపీగా ఎన్నికై మొదటిసారి జిల్లా పరిషత్ సమావేశానికి శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమెను జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సత్కరించి అభినందనలు తెలిపారు. అంతకుముందు ఆమె బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ పాటిల్, జడ్పీ చైర్‌పర్సన్ శోభను సన్మానించారు.***

***- నాగిరెడ్డిపేట, జూన్7***

## బాన్సువాడలో సైబర్ మోసం

### క్రెడిట్ కార్డు నుంచి షాపింగ్ చేసినట్లు మెస్సేజ్

బాన్సువాడ, జూన్ 7: బాన్సువాడ పట్టణంలోని కోటగల్లీలో ఉండే పత్తి శ్రీనివాస్‌కు చెందిన ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు నుంచి గుర్తు తెలియని వ్యక్తులు షాపింగ్ చేసి సైబర్ మోసానికి పాల్పడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 27వ తేదీన తన ఫోన్‌కు 9640595945 నంబర్ నుంచి ఓ మెస్సేజ్ వచ్చినట్లు పేర్కొన్నాడు. తన క్రెడిట్‌కార్డు నుంచి నాలుగు ట్రాన్సాక్షన్లలో మొత్తం రూ. 77,604 చెల్లింపులు జరిగినట్లు ఎస్ఎంఎస్ వచ్చినట్లు తెలిపారు. బాధితుడు శ్రీనివాస్ సైబర్‌క్రైం నంబర్ 1930 కాల్ చేసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మరుసటి రోజున వేరే ఫోన్‌లో వాట్సాప్ ఇన్‌స్టాల్ అయినట్లు మెస్సేజ్ వచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం తన ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేశానని, తన డబ్బులు రికవరీ చేయాలని కోరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు పట్టణ సీఐ మున్నూరు కృష్ణ తెలిపారు.